### జనవరి 26న ట్రాక్టర్ పరేడ్

- 500 జిల్లాల్లో చేపడతాం
- కేంద్ర విధానాల్ని ఎండగడతాం
- సంయుక్త కిసాన్ మోర్చా ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: కేంద్రంలో మోదీ సర్కార్ విధానాల్ని నిరసిస్తూ వచ్చే ఏడాది జనవరి 26న ట్రాక్టర్లతో రైతులు పరేడ్ నిర్వహిస్తారని రైతు సంఘాల ఐక్య వేదిక 'సంయుక్త కిసాన్ మోర్చా' (ఎస్‌కేఎం) ప్రకటించింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో రిపబ్లిక్ డే వేడుకలు ముగిసిన వెంటనే ట్రాక్టర్ ర్యాలీ చేపడతామని తెలుపుతూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పెద్ద సంఖ్యలో పాల్గొని ట్రాక్టర్ పరేడ్‌ను విజయవంతం చేయాలని దేశవ్యాప్తంగా రైతుల్ని కోరింది. 'అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 500 జిల్లాల్లో ట్రాక్టర్ పరేడ్ చేపడతాం. ట్రాక్టర్లు, ఇతర వాహనాలతో రైతులు పరేడ్‌లో పాల్గొనవచ్చు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం, సోషలిజం సూత్రాల్ని పరిరక్షిస్తామని రైతులు ప్రతిజ్ఞ చేయనున్నారు' అని ఎస్‌కేఎం తెలిపింది. మోదీ సర్కార్ అనుసరిస్తున్న రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాల్ని సామాన్యులకు వివరిస్తూ జనవరి 10-20 మధ్య 20 రాష్ట్రాల్లో 'జన జాగరణ్'ను చేపడుతున్నట్టు తెలిపింది. రైతుల డిమాండ్లు నెరవేరే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఎస్‌కేఎం స్పష్టం చేసింది.

# మేడారంలో విడిది సౌకర్యం!

- దేశ, విదేశీ భక్తుల కోసం సరికొత్త వ్యూహం
- కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు
- మేడారం చుట్టుపక్కల 10 గ్రామాల ఎంపిక

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): మేడారం మహాజాతరకు వచ్చే దేశ, విదేశీ పర్యాటకులు, భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త ప్రతిపాదన చేసింది. ప్రపంచవ్యాప్తంగా పర్యాటక ప్రాంతాల్లో ప్రాచుర్యం, ఆదరణ పొందుతున్న 'హోంస్టే' సౌకర్యాన్ని కల్పించే ప్రతిపాదనను కేంద్రానికి పంపింది. ములుగు జిల్లా గోవింద రావుపేట, తాడ్వాయి (పస్రా టు మేడారం, తాడ్వాయి టు పస్రా) మండలాల్లోని పది గ్రామాల్లో హోంస్టే సౌకర్యాన్ని కల్పించేందుకు అవసరమైన నిధులు, అనుమతులు ఇవ్వాలని గిరిజన సంక్షేమశాఖ కేంద్రాన్ని కోరింది. మేడారం, కన్నెపల్లి, ఊరట్టం, రెడ్డిగూడెం, నార్లాపూర్, కామారం తదితర పది గ్రామాల్లో హోంస్టే సౌకర్యం కల్పించడం ద్వారా భక్తులకు సౌకర్యాలతోపాటు మేడారం చుట్టుపక్కల ప్రాంతాలకు ప్రాచుర్యం లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. మేడారం సమీపంలోని మల్లూరు లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, బొగత జలపాతం, గోదావరి నదిపై నిర్మించిన ముళ్లకట్ట, లక్నవరంలోని వేలాడే వంతెన, ప్రపంచ కట్టడంగా ఖ్యాతిపొందిన రామప్పగుడి వంటి అనేక దర్శనీయ, సందర్శనీయ, పర్యాటక ప్రాంతాలు ఉన్న నేపథ్యంలో హోంస్టేకు గొప్ప ఆదరణ ఉంటుందని కేంద్రానికి పంపిన ప్రతిపాదనల్లో ప్రభుత్వం పేర్కొన్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ ప్రతిపాదనను కేంద్రం ఆమోదిస్తే రాష్ట్రంలో తొలిసారిగా 'హోంస్టే' పొందిన ఖ్యాతిని మేడారం దక్కించుకోనున్నది.

#### హోంస్టే అంటే?

దేశ, విదేశాల్లో హోంస్టేకు ఆదరణ పెరుగుతున్నది. దేశవ్యాప్తంగా ఇప్పటికే 1,977 హోం స్టే కేంద్రాలు ఉన్నాయి. దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకుల (జాతర ప్రాంతాల్లో భక్తులు)కు ఆయా ప్రాంతాల సమీప ప్రజల ఇండ్లు, స్థలాలను ఆవాస ప్రాంతాలుగా రూపొందించటం, అక్కడి నుంచి సమీప పర్యాటక ప్రాంతాలకు వాహన సౌకర్యం, భోజన, నివాస సదుపాయాలు కల్పించడమే హోంస్టే లక్ష్యం. అయితే ఈ నేపథ్యంలో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది.

### ప్లాస్టిక్ ఫ్రీ జాతరగా నిర్వహించాలి

రానున్న ఫిబ్రవరిలో జరిగే మేడారం మహాజాతరను ప్లాస్టిక్ ఫ్రీ జాతరగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ నిర్ణయించింది. జాతర నిర్వహణ భాగస్వామ్య శాఖల సమన్వయంతో భక్తులకు విస్తృత అవగాహన, ప్రచారం నిర్వహించే కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి సమీక్షా సమావేశంలో సూచించారు. జాతరకు జాతరకు భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అదే స్థాయిలో ప్లాస్టిక్ వాడకం కూడా పెరుగుతున్నదని, అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ నిల్వలు పేరుకుపోవడం వల్ల ప్రకృతికి తీరని నష్టం వాటిల్లుతుందని, దీనిని నివారించాలని గిరిజన సంక్షేమశాఖ నిర్ణయించింది.

ఇందుకు కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి.

# శాఖలమధ్య సమన్వయమేది?

- బాధ్యులెవరో మేమే తేలుస్తాం
- రామంతాపూర్ చెరువు దురాక్రమణ కేసులో హైకోర్టు

హైదరాబాద్, డిసెంబర్ 28, (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరం రామంతాపూర్ పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణ నోటిఫికేషన్ జారీ చేయడంలో ప్రభుత్వ శాఖలు జాప్యం చేయడంపై హైకోర్టు మండిపడింది. ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. రెవెన్యూ శాఖ సహకరించడం లేదని జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏలు చెప్పడం సరికాదని హెచ్చరించింది. సమన్వయంతో నిర్ణయం తీసుకోకపోతే ఆయా శాఖల అధికారులను కోర్టుకు పిలిపించి ఎవరు బాధ్యులో తాము తేలుస్తామని హెచ్చరించింది. కొత్తగా హెచ్‌ఎండీఏ, ప్రైవేట్ వ్యక్తులను ప్రతివాదులుగా చేర్చి వారికి కూడా నోటీసులు జారీ చేసిన న్యాయస్థానం విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. రామంతాపూర్‌లో 25 ఎకరాల్లోని పెద్దచెరువును డంపింగ్ యార్డుగా మారుస్తున్నారని, దీనివల్ల నీరు కాలుష్యమవుతున్నదని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కేఎల్ వ్యాస్ 2005లో రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించి గురువారం మరోసారి విచారణ చేపట్టింది.

ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు తహసీల్దార్ సహకరించడం లేదని పురపాలక శాఖ తరపు న్యాయవాది చెప్పారు. ఎఫ్‌టీఎల్‌పై ప్రాథమికంగా 490 అభ్యంతరాలు వచ్చాయని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు, వాళ్లంతా కోర్టులకు వెళ్లి స్టేలు తెచ్చుకొనేలా అధికారులు కాలయాపన చేస్తున్నారని వ్యాఖ్యానించింది. పురపాలక శాఖ న్యాయవాది వాదనను రెవెన్యూ శాఖ తరపు న్యాయవాది తప్పుపట్టారు. ఈ కేసులో హెచ్‌ఎండీఏ ప్రతివాదిగా లేదని చెప్పారు. నీటిపారుదల, రెవెన్యూ శాఖలతోపాటు జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏలను సంప్రదించి ప్రిలిమినరీ నోటిఫికేషన్ తర్వాత తుది నోటిఫికేషన్ జారీ చేస్తామని అన్నారు. తాము సహకరిస్తున్నామని జీహెచ్‌ఎంసీ తరపు న్యాయవాది చెప్పారు. వాదనల తర్వాత హైకోర్టు, నివేదిక తప్ప కార్యాచరణ ఏమీ కనిపించడంలేదని వ్యాఖ్యానించింది. హెచ్ ఎండీఏతోపాటు ప్రైవేటు వ్యక్తులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

# విభేదాలు పక్కనపెట్టి పనిచేయండి

- బీజేపీ సీనియర్లకు అమిత్ షా క్లాస్
- 35% ఓట్లు, 10 ఎంపీ స్థానాలు గెలవాలని టార్గెట్

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర బీజేపీ సీనియర్ నేతలు విభేదాలను పక్కనబెట్టి పనిచేయాలని ఆ పార్టీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సూచించారు. ముఖ్యంగా నేతల మధ్య కోల్డ్‌వార్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. గురువారం ఆయన కొంగరకలాన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సులో పాల్గొన్నారు. అంతకుముందు నోవాటెల్ హోటల్‌లో బీజేపీ సీనియర్లతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ.. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడొద్దని, లీకులు ఇవ్వొద్దని సూచించినట్టు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో అంచనాలకు తగ్గట్టుగా ఎందుకు ఓట్లు, సీట్లు రాలేదని ఆరా తీసినట్టు తెలిసింది. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ 35% ఓటింగ్ సాధించడంతోపాటు పది లోక్‌సభ స్థానాలు గెలవాలని, అందుకు అనుగుణంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క ఎమ్మెల్యే సీటు గెలిచినా, నాలుగు ఎంపీ స్థానాల్లో విజయం సాధించామని, ఈసారి ఎమినిది మంది ఎమ్మెల్యేలు ఉన్నందున పదికి తగ్గకుండా ఎంపీ సీట్లు గెలవాలని అన్నారు. 'మరోసారి మోదీ విజయం చారిత్రక అవసరం' అనే తీర్మానాన్ని రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆమోదించారు. పది లోక్‌సభ స్థానాల్లో గెలిచేలా కృషి చేస్తామని క్యాడర్‌తో అమిత్‌షా ప్రతిజ్ఞ చేయించారు.

# మలిసంధ్యపై ముందుచూపు

- 67 శాతం మందికి రిటైర్మెంట్ ప్రణాళికలు
- మూడేండ్లలోనే 18 శాతం పెరిగిన ఆసక్తి
- 23 శాతానికి పెరిగిన మ్యూచువల్ ఫండ్స్
- కరోనా ప్రభావంతోనే : పీజీఐఎమ్ సర్వే

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): కరోనా ప్రభావంతో వృద్ధాప్యంలో ఆర్థిక ప్రణాళిక కీలకమన్న విషయం చాలా మందికి అర్థమైంది. దీంతో చాలా మంది రిటైర్మెంట్ తర్వాత ఎవరిపైనా ఆధారపడకుండా బతికేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో దేశంలో పదవీ విరమణ తర్వాత ఆర్థిక ప్రణాళికలు ఏమిటి? ఎంతమంది రిటైర్మెంట్ ప్లాన్స్ చేస్తున్నారు? ఉద్యోగ భద్రత, పనిలో ఒత్తిడి, ఆకస్మిక ప్రణాళికలు తదితర అంశాలపై పీజీఐఎమ్ ఇండియా మ్యూచువల్ ఫండ్ రిటైర్మెంట్ రెడీనెస్ సర్వే నిర్వహించింది. పలు కీలక అంశాలను వెల్లడించింది. హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్, కోల్‌కతా, పూణెతోపాటు మరో ఆరు నగరాల్లో సర్వే నిర్వహించింది. మొత్తం 3,009 మంది సర్వేలో పాల్గొని వారి అభిప్రాయాలను వెల్లడించారు. వృద్ధాప్యంలో ఆర్థిక ప్రణాళిక చాలా కీలకమని సర్వేలో ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు. ద్రవ్యోల్బణం, ఆర్థిక అభద్రత రోజురోజుకూ పెరిగిపోతున్న క్రమంలో వృద్ధాప్యం కోసం ఆర్థిక ప్రణాళిక అవసరమని తెలిపారు. ఒకప్పుడు పిల్లల చదువులు, భవిష్యత్తు వంటి అంశాలపైనే ఎక్కువ శ్రద్ధ ఉండేదని, ఇప్పుడు ఆ జాబితాలో రిటైర్మెంట్ ప్లాన్ కూడా చేరిందని వెల్లడించారు.

#### 67 శాతం మందికి రిటైర్మెంట్ ప్లాన్స్

కరోనా ప్రభావం తర్వాత చాలా మందిలో ఆర్థిక ప్రణాళికపై అవగాహన వచ్చింది. వృద్ధాప్యంలో ఎవరిపైనా ఆధార పడకుండా ఉండాలని ఎక్కువ మంది భావిస్తున్నారు. అనారోగ్య పరిస్థితి వచ్చినా, ఆర్థిక అవసరాలకు కావాలన్నా, పిల్లలపై ఆధారపడకుండా ఉండాలని అనుకుంటున్నారు. రిటైర్మెంట్ తర్వాత ఆర్థిక అవసరాలు తీరేలా ముందుగానే రిటైర్మెంట్ ప్లాన్స్‌పై ఆసక్తి చూపుతున్నారు. 2020లో 49 శాతం మంది ఉద్యోగులకు రిటైర్మెంట్ ప్లాన్స్ ఉంటే, 2023లో అది 67 శాతానికి పెరిగింది. అంటే.. వృద్ధాప్యంలో ఆర్థిక అవసరాల గురించి ఆలోచించే వారి సంఖ్య మూడేండ్లలోనే 18 శాతం పెరిగింది. 33 ఏండ్ల వయసు నుంచే ఎక్కువమంది రిటైర్మెంట్ ప్లాన్స్ ప్రారంభిస్తున్నారు. కొందరు 50 ఏండ్ల వయసులోనూ ప్రణాళిక చేస్తున్నారు. ఉద్యోగ భద్రత గురించి ఆలోచించేవారి సంఖ్య 69 శాతం నుంచి 55 శాతానికి తగ్గింది. ఉద్యోగంలో ఒత్తిడికి గురయ్యేవారి సంఖ్య 68 నుంచి 55 శాతానికి తగ్గింది. ఆకస్మికంగా ఆర్థిక ప్రణాళికలు చేసేవారి సంఖ్య 88 శాతం నుంచి 81 శాతానికి చేరింది. అంటే.. ముందస్తు ఆర్థిక ప్రణాళికలు చేసేవారి సంఖ్య పెరిగిందని సర్వే స్పష్టం చేసింది. ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను ఏర్పాటు చేసుకునే వారి సంఖ్య 73 నుంచి 75 శాతానికి పెరిగింది. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు 10 నుంచి 23 శాతానికి పెరిగాయి. ఇలా.. వృద్ధాప్యంలో ఆర్థిక తోడు ఎంతో అవసరమని ఎక్కువమంది భావిస్తున్నారు.

# కాంగ్రెస్‌కు విరాళాల్లో తెలంగాణ టాప్!

- వచ్చింది.. 8.57 కోట్లు.. తెలంగాణ వాటా 1.38 కోట్లు
- క్రౌడ్ ఫండింగ్ ద్వారా విరాళాలు సేకరిస్తున్న కాంగ్రెస్

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): ప్రజల నుంచి విరాళాలు సేకరించేందుకు కాంగ్రెస్ పార్టీ తాజాగా ప్రారంభించిన 'డొనేట్ ఫర్ దేశ్' అనే కార్యక్రమానికి దేశవ్యాప్తంగా స్పందన లభిస్తున్నది. ఈ నెల 18న విరాళాల సేకరణను ప్రారంభించగా.. గురువారం సాయంత్రం 5.20 గంటల వరకు రూ.8,57,71,985 వసూలయ్యాయి. ఇందులో తెలంగాణ నుంచే అత్యధికంగా విరాళాలు అందడం విశేషం. తెలంగాణ నుంచి రూ. 1.38 కోట్ల విరాళాలు అందినట్టు కాంగ్రెస్ పార్టీ వెబ్‌సైట్ వెల్లడించింది. అందిన విరాళాల వివరాలను ఎప్పటికప్పుడు కాంగ్రెస్ పార్టీకి చెందిన వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేస్తున్నారు. విరాళాలను ఆన్‌లైన్‌లో కాంగ్రెస్ పార్టీ సేకరిస్తున్నది. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి 138 సంవత్సరాలు అయిన సందర్భంగా రూ.138, రూ.1380, రూ.13,800, రూ.1,38,000 చొప్పున, ఇతర మొత్తాల చొప్పున కూడా స్వీకరిస్తున్నది.

#### మొదటి స్థానంలో తెలంగాణ..

తెలంగాణ నుంచి అత్యధికంగా విరాళాలు అందినట్టు కాంగ్రెస్ పార్టీ క్రౌడ్‌ఫండింగ్ డొనేషన్ డాష్‌బోర్డు వెల్లడించింది. తెలంగాణ నుంచి గురువారం సాయంత్రం వరకు రూ.1,38,46,450 అందినట్టు వెల్లడైంది. రెండో స్థానంలో ఉన్న మహారాష్ట్ర నుంచి రూ.1,07,62,909 అందాయి. మూడో స్థానంలో ఉన్న రాజస్థాన్ నుంచి రూ. 95,76,278, ఆ తరువాతి స్థానంలో ఉన్న హర్యానా నుంచి రూ.86.98 లక్షలు, ఉత్తరప్రదేశ్ నుంచి రూ.60.76 లక్షల విరాళంగా అందినట్టు అందులో పొందుపర్చారు. అతి తక్కువగా సిక్కిం నుంచి కేవలం రూ. 2,301 మాత్రమే విరాళంగా అందినట్టు తెలిపారు. ఎక్కువ మంది విరాళాలు అందించిన రాష్ట్రాలలో రాజస్థాన్ మొదటి స్థానంలో ఉంది. ఐదో స్థానంలో 6.0 శాతంతో తెలంగాణ నిలిచింది. దీనినిబట్టి తెలంగాణ నుంచి అతి తక్కువమంది అత్యధిక మొత్తంలో ఇచ్చినట్టు తెలుస్తున్నది.

# కిషన్‌రెడ్డిని మార్చేందుకే అమిత్ షా రాక!

- ఒక కేంద్ర మంత్రి స్వయంగా ఈ విషయం చెప్పారు
- కాంగ్రెస్‌తో టచ్‌లో 15 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- బీజేపీ ఎంపీ సోయం బాపురావు త్వరలో కాంగ్రెస్‌లోకి
- ఎంపీగా పోటీ చేయను
- పీసీసీ చీఫ్ పోస్టు బీసీలకు ఇస్తరనేది ఊహాగానమే
- ఆ పదవిని ఇప్పటికే కోరుతున్న ఒక రెడ్డి మంత్రి
- మధుయాష్కీగౌడ్ వ్యాఖ్యలు

హైదరాబాద్, డిసెంబర్ 28(నమస్తే తెలంగాణ): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని ఆ పదవి నుంచి తప్పించబోతున్నారని, దీనిపై చర్చించేందుకే ఆ పార్టీ అగ్రనేత అమిత్ షా రాష్ట్రానికి వచ్చారని కాంగ్రెస్ మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ అన్నారు. ఈ విషయాన్ని ఓ కేంద్ర మంత్రి స్వయంగా తనతో చెప్పారని తెలిపారు. కేంద్ర హోంమంత్రి మంత్రి అమిత్ షా గురువారం రాష్ట్రంలో పర్యటించిన విషయం తెలిసిందే. దీంతో మధుయాష్కీ గౌడ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గురువారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ... కిషన్‌రెడ్డి పొద్దున లేస్తే.. జై అసద్ భాయ్ అంటున్నారని ఆరోపించారు. ఇదంతా సికింద్రాబాద్ ఎంపీగా గెలిచేందుకేనని విమర్శించారు. తనను ఎల్బీనగర్‌లో కావాలనే ఓడించారని, సొంత పార్టీ నేతలే వెన్నుపోటు పొడిచారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 30 వేల నకిలీ ఓట్లను నమోదు చేయించి తనను ఓడించారని ఆరోపించారు. పార్టీ మారేందుకు సుధీర్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని, వాళ్లకు వారి అక్రమాస్తులు కాపాడుకోవడమే ముఖ్యమని ధ్వజమెత్తారు. చంద్రబాబు జైలుకు వెళ్లిన తర్వాత సెటిలర్లు కాంగ్రెస్‌వైపు చూశారని, కానీ ఆయన విడుదలయ్యాక బీఆర్ఎస్‌వైపే మొగ్గు చూపారని అన్నారు. గ్రేటర్‌లో ముస్లింలు, సెటిలర్లు, రియల్టర్లు బీఆర్ఎస్‌కే సపోర్ట్ చేశారని తెలిపారు. బోధన్‌లో షకీల్‌ను ఓడించేందుకు కాంగ్రెస్ పార్టీకి ఎంఐఎం సపోర్ట్ చేసిందని తెలిపారు.

#### ఎంపీ పోటీలో లేను

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 15 సీట్లు గెలువటమే టార్గెట్‌గా పెట్టుకున్నదని మధుయాష్కీ తెలిపారు. అయితే తాను లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయటంలేదని చెప్పా రు. నిజామాబాద్ ఎంపీ స్థానం నుంచి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పోటీ చేసే అవకాశం ఉన్నదని తెలిపారు. తనకు ఎమ్మె ల్సీ పదవి ఇవ్వటంపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. బీసీ నేతలకు పీసీసీ అధ్యక్ష పదవి ఇస్తారనేది ఊహాగానం మాత్రమేనని స్పష్టం చేశారు. ఒక రెడ్డి మంత్రి కూడా ఆ పదవి కోసం ప్రయత్నిస్తున్నారని తెలిపారు. మంత్రివర్గ విస్తరణ పూర్తిగా సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టమేనని, ఇందులో అధిష్ఠానం జోక్యం చేసుకోబోదని అన్నారు. అయితే నామినేటెడ్ పదవులు ఎమ్మెల్యేలకు ఇచ్చేందుకు మాత్రం అధిష్ఠానం వ్యతిరేకమని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడ్డవారికి ఆ పదవులు ఇవ్వాలని ఇప్పటికే రాహుల్ గాంధీ చెప్పినట్టు తెలిపారు. త్వరలోనే ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి భారీ వలసలు ఉండబోతున్నాయని మధుయాష్కీ చెప్పారు. ఇప్పటికే బీఆర్ఎస్‌కు చెందిన 15 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, అయితే పార్టీ ఇమేజ్ దెబ్బ తింటుందనే ఉద్దేశంతో తమ పార్టీ అధిష్ఠానం వద్దంటున్నదని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే బీజేపీ ఎంపీ సోయం బాపురావు కాంగ్రెస్‌తో చర్చలు జరిపారని, పార్లమెంట్ ఎన్నికల వరకు ఆయనతో పాటు చాలా మంది బీజేపీ నేతలు కాంగ్రెస్‌లోకి రాబోతున్నారని వెల్లడించారు.

# అమ్మానాన్న.. అరణ్యరోదన!

> చిన్నప్పుడు నా కొడుక్కి చిన్న జ్వరమొచ్చినా తట్టుకోలేక పోయా. దవాఖానకు వెళ్లి మందులు తెచ్చాం. ఎత్తుకుంటే తప్ప ఏడుపు ఆపేది కాదు. ఈ చేతులతోనే భుజాన ఎత్తుకొని రాత్రంతా తిరుగుతునే ఉన్నా. ఆ టైంలో నిద్రపోకున్నా పల్లేదనిపించింది. నా భర్త కూడా ఎత్తుకుని తిరిగాడు. నా కొడుకుని అల్లారు ముద్దుగా పెంచుకున్నాం. కానీ ఈ రోజు వాడు నన్ను ముట్టుకోవడానికి కూడా ఇష్టపడటం లేదు. నా భర్త చనిపోయిన ఏడాదికే నన్ను ఈ ఆశ్రమంలో వదిలేసి వెళ్లిపోయాడు. వాడితో నా చివరి కోరిక పంచుకున్నా. నా ఊపిరి ఆగిపోయాక నువ్వే నా చితికి నిప్పంటించాలని అడిగా. చూద్దాంలే అంటూ వెళ్లి పోయాడు.
>
> - మెహిదీపట్నంలోని ఓ ఆశ్రమంలో ఉంటున్న వృద్ధురాలి కన్నీటి గాథ

> కొడుకు ఇంట్లో నేనుంటే కోడలు వెళ్లిపోతానంటున్నది. ఓ రోజు కొడుకు, కోడలు గొడవపడటం విన్నా. మీ అమ్మ కావాలా? నేను కావాలా? అని అరిచింది. ఇంట్లో ప్రశాంతంగా ఉండలేకపోతున్నానంటూ కోపంగా చెప్పింది. నా కొడుకు ఆమెను శాంతింపజేయటానికి ప్రయత్నించాడు. కానీ ఆమె మరింత కోపంతో తన నుంచి దూరం చేయకపోతే తానే చంపేస్తానని అరిచింది. నా కొడుకు ఆమెపై చెయ్యి చేసుకున్నాడు. అదే రాత్రి ఆమె తన పుట్టింటికి వెళ్లిపోయింది. అత్త వేధింపుల వల్లే వెళ్లిందంటూ బంధువులంతా నన్ను దోషిలా చూశారు. నా కొడుకు జీవితం నా వల్ల అగకూడదు. అందుకే నేను నా బిడ్డను వదిలేసి వృద్ధాశ్రమానికి వచ్చాను. నా కొడుకు గుర్తొచ్చినప్పుడల్లా నా గుండె తరుక్కుమంటుంది. పేగులు కదిలినట్టు అనిపిస్తుంది.
>
> - సైనిక్‌పురిలోని ఓ వృద్ధురాలు

> ఈ ఆశ్రమంలో నేను ఉంటానని ఏ రోజూ అనుకోలేదు. నా దోస్తుల్లో కొందరు చనిపోయారు. ఇంకొందరూ వారి బిడ్డలు, మనవలు, మనవర్శాతో సరదాగా గడుపుతున్నారు. కానీ నేను మాత్రం ఇలా ఏకాకిగా మిగిలిపోయా. మట్టూ చూస్తే నాలుగు గోడలు. ఏ గోడను చూసినా నా బిడ్డలే గుర్తొస్తున్నారు. ఇదిగో ఈ ఎడమవైపు గోడ నా కొడుకు. ఇదిగో ఈ కుడివైపు గోడ నా బిడ్డ. ఆ గోడలే నా బిడ్డలు. రోజంతా వాటిని చూసుకుంటూ ఉంటా. పిల్లలకు ప్రేమ లేకుంటే తల్లిదండ్రులు బతికి ఉన్నా లేనట్టే.
>
> - మల్కాజిగిరికి చెందిన ఓ ఆశ్రమంలోని వృద్ధురాలు

వృద్ధాశ్రమంలోని ఒక వృద్ధురాలితో ముచ్చటిస్తున్న నాగచంద్రికాదేవి

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): వృద్ధ జీవితం నేటి తరం వారసులకు శత్రువుగా మారుతున్నది. కనికరం లేని బిడ్డలు.. కడుపున మోసిన తల్లిదండ్రులను ఆశ్రమాల్లో వదిలేస్తున్నారు. మరికొందరు రోడ్డున వదిలేసి వెళ్లిపోతున్నారు. ఇంకొందరు ఇంట్లోనే ఉంచి నరకం చూపిస్తున్నారు. బంధాలు, బంధుత్వాలు, ప్రేమానురాగాలు ఆవిరై చివరకు కడుపున పుట్టినవారు అమ్మానాన్నలకు పట్టెడు అన్నం పెట్టని దుస్థితికి చేరుకున్నారు. జీవితంలో ఎన్నో ఆటుపోట్లను చవిచూసి, విశేష అనుభవాల జ్ఞానంతో మలిసంజెలోకి చేరిన ఆ వృద్ధులు అందరున్నా ఏకాకులుగా మిగులుతున్నారు. రోజురోజుకు వృద్ధాశ్రమాలు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తున్నదని సామాజిక కార్యకర్తలను చెబుతున్నారు. గ్రేటర్‌లో అధికారికంగా 234కు పైగా వృద్ధ ఆశ్రమాలు ఉంటే.. అనధికారికంగా వ్యాపారమే పరమావధిగా 460కి పైగా ఆశ్రమాలు ఉన్నాయని తెలిపారు. రక్త సంబంధమే దూరం పెడితే ఇంక ఏ సంబంధం అక్కున చేర్చుకుంటుంది? ఇంట్లోని కష్టాలతో పోలిస్తే ఇక్కడ కొన్ని తక్కువేనంటూ వృద్ధులు తమ ఆవేదన వ్యక్తం చేశారు.

#### కార్పొరేట్ కల్చర్‌తో..!

వృద్ధులకు గతంలో మంచి గౌరవం ఉండేది. వారిని కంటికి రెప్పలా చూసుకునే పిల్లలు ఉండేవారు. కుటుంబంలో వారి అభిప్రాయాలకు మన్నన దక్కేది. కానీ ఈ కార్పొరేట్ యుగంలో తల్లిదండ్రులు, పిల్లల మధ్య మానవత్వం క్షీణిస్తున్నది. వృద్ధులుగా మారాక వారితో పిల్లల అటాచ్‌మెంట్ తగ్గిపోతున్నది. నైతిక విలువలు లోపించటం, ఆర్థిక ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వటం, కార్పొరేట్ చదువులు, సాఫ్ట్‌వేర్ కొలువులు, వ్యాపారాలు, భారీ ఆదాయాల వెంట పరుగులతో అమ్మానాన్న నిరాదరణకు గురవుతున్నారు. కుటుంబవ్యవస్థను, పెద్దలను గౌరవించే సంప్రదాయమూ చెదిరిపోతున్నది. ఫలితంగా వృద్ధులు బిడ్డల చేతిలో వేధింపులకు గురవుతున్నారు. సొంత ఇంట్లోనే బిక్కుబిక్కుమంటూ ఏ చీకటి మూలనో, వృద్ధాశ్రమంలోనో శేష జీవితం గడిపేస్తున్నారు. అందరూ ఉండి అనాథలుగా మిగిలిపోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరు పదుల వయసు దాటిన ప్రతి ఆరుగురిలో ఒకరు నిత్యం ఏదో ఒక రూపంలో వేధింపులకు గురవుతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం వెల్లడించింది. హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ సర్వేలో 21 శాతం కోడళ్ల చేతిలో, 25 శాతం కొడుకుల చేతిలో చిత్రహింసలు అనుభవిస్తున్నారని తేలింది. అయినా, బయటకు వెళ్లి బతకలేక మౌనంగా ఆ బాధలను దిగమింగుతూ కాలం వెల్లదీస్తున్నారు వృద్ధులు. ఇండ్లలో పనిచేసేవారి చేతిలోనూ 2 శాతం వృద్ధులు హింసకు గురవుతున్నారని సర్వే పేర్కొన్నది.

# ఈటల, కొండా చూపు కాంగ్రెస్ వైపు!

> మొదటిపేజీ తరువాయి...

రాజేందర్, బండి సంజయ్ పేర్లు వినిపించాయి. ఆరెస్సెస్ నేపథ్యం ఉన్న బండి సంజయ్ ఎట్టిపరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌లో చేరరని, కాబట్టి రామ్మోహన్‌రెడ్డి చెప్పింది ఈటల గురించేనని భావిస్తున్నారు. ఈటల తోపాటు మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరుగుతున్నది. బీజేపీలో తమకు భవిష్యత్తు లేదని ఇద్దరు నేతల